సాక్షి
కామారెడ్డి
మంగళవారం। 9। సెప్టెంబర్। 2025



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



వేగ నియంత్రణకు..

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రాజేశ్ చంద్ర కలెక్టర్ సంగ్వాన్‌కు వివరించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /21.2

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

యూరియా.. లేదయ!

జిల్లా రైతాంగాన్ని యూరియా కొరత ఇబ్బందిపెడుతోంది. అవసరమైన సమయంలో ఎరువు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజూ సొసైటీల చుట్టూ తిరుగుతున్నా బస్తా కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొరత తీర్చాలని అధికారులను కోరుతున్నారు.

వేధిస్తున్న కొరత

- ఇబ్బందిపడుతున్న రైతులు
- బస్తా కోసం గంటల తరబడి బారులు
- అయినా దక్కక నిరాశ



మాచారెడ్డిలో వరుసలో ఉన్న రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వానాకాలంలో సాగు చేసిన పంటలకు అవసరమైన మేర యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఎక్కడ చూసినా రైతులు ఎరువుల కోసం సహకార సంఘాల వద్ద బారులు తీరి కనిపిస్తున్నారు. కొన్నిచోట్ల రాత్రి వేళలోనే సొసైటీకి చేరుకుని అక్కడే ఉండి పొద్దున్నే వరుసలో నిల్చుంటున్నారు. మరికొన్ని చోట్ల చెప్పులు, రాళ్లు, చెట్లకొమ్మలు, పాసుపుస్తకాల జిరాక్సులను వరుసలో పెడుతున్నారు. జిల్లాలోని మాచారెడ్డి, రామారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, కామారెడ్డి తదితర మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆయా మండలాల్లో యూరియా కోసం రైతులు పది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో చెరువులు, ప్రాజెక్టులు నిండాయి. వర్షాలతో కొంత నష్టం జరిగినా, ఉన్న పంటలకు ఎరువులు వేయాలని రైతులు సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. స్టాక్‌కు మించి రైతులు వస్తుండడంతో ఒక్కో బస్తా చొప్పునే పంపిణీ చేస్తున్నారు. ఆ ఒక్క బస్తా కూడా చాలా మందికి దక్కడం లేదు.

ఆందోళనకు దిగుతున్న రైతులు..

ఎరువులు దొరకని రైతులు ఆందోళనకు దిగుతున్నారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయిలో రైతులు సోమవారం యూరియా కోసం ధర్నా చేశారు. అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచారెడ్డి మండల కేంద్రంలోనూ రైతులు రోడ్డెక్కారు. మరికొన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉంది. రోజూ యూరియా కోసం రైతు లు ఊళ్ల నుంచి సొసైటీల వద్దకు చేరుకుంటున్నా రు. ఎరువు లోడ్ వస్తుందని చెబితే చాలు వరుస కడుతున్నారు. తీరా లోడ్ రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఒక్క బస్తా కోసం నాలుగైదు రోజులుగా తిరుగుతున్నవారూ ఉన్నారు. పొలం దగ్గరకు వెళ్లాల్సిన రైతులు.. ఎరువుల కోసం సొసైటీల వద్ద పొద్దంతా గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పల్‌వాయిలో ధర్నా చేస్తున్న రైతులు

ఉప్పల్‌వాయిలో ఆందోళన

మాచారెడ్డిలో పోలీసుల సహకారంతో రైతులకు టోకెన్లు ఇస్తున్న సొసైటీ అధికారులు

రామారెడ్డి : యూరియా కోసం రైతులు ఉప్పల్‌వాయి సొసైటీ భవనం వద్ద ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. సొసైటీకి 440 బస్తాల యూరియా రావడంతో రైతుకు ఒక బస్తా చొప్పున ఇస్తామని అధికారులు చెప్పారు. అయితే రెండు బస్తాలైనా ఇవ్వాలంటూ రైతులు పట్టుబట్టారు. దీంతో అధికారులు పంపిణీని వాయిదా వేశారు. మరో లోడ్ వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ రైతులు ధర్నా చేశారు. పోలీసులు వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : మండలకేంద్రానికి సోమవారం యూరియా వస్తుందని అధికారులు చెప్పడంతో వేకువజామునే అన్ని గ్రామాల నుంచి సింగిల్‌విండోకు వచ్చి బారులు తీరారు. యూరియా రాకపోవడంతో విసిగి వేసారిన రైతులు ఇటుకలను క్యూలో ఉంచి ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎస్సై అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించి, టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు.

పోలీసు పహారాలో పంపిణీ...

మాచారెడ్డి మండల కేంద్రంలోని సహకార సంఘానికి సోమవారం భారీ సంఖ్యలో రైతులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కూపన్లు ఇవ్వడానికి అధికారులు పోలీసుల సాయం తీసుకున్నారు. అక్కడ రైతులు, పోలీసులకు మధ్య న పలుమార్లు వాగ్వాదం జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతోనూ రైతులు గొడవకు దిగారు. చాలాచోట్ల రోజూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. సరైన ప్రణాళిక లేకపోవడం, అధికారులు సరైన విధంగా స్పందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేటు వ్యాపారుల బ్లాక్ దందా!

కొందరు వ్యాపారులు ముందుగానే యూరియాను బ్లాక్ చేసి ఉంచారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కువ డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు దళారులు పెద్ద మొత్తంలో ఎరువులు స్టాక్ చేసి ఉంచారన్న ప్రచారం జరుగుతోంది. నిఘా ఉంచి బ్లాక్ దందాను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

సమస్య పరిష్కారమవుతుంది

జిల్లాలో 48 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటికే 46 వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. దానిని రైతులకు అందించాం. మంగళవారం మరో 800 మెట్రిక్ టన్నుల యూరియా రానుంది. ఆయా సొసైటీలకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేస్తాం. బ్లాక్ మార్కెట్ విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా బ్లాక్‌మార్కెట్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

పనులు నాణ్యతతో చేపట్టాలి

- పంట నష్టం సర్వే కొనసాగుతోంది
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన కిరణ్మయి, చందర్ నాయక్

కామారెడ్డి క్రైం : జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.10 కోట్లను కేటాయించిందన్నారు. ఇందులో ఇప్పటికే రూ.7.07 కోట్లను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు కేటాయించి పనులను ప్రారంభించామన్నారు. మిగిలిన వాటిని ఇరిగేషన్, ఇతర పనులకు కేటాయించామన్నారు. జిల్లాలో దెబ్బతిన్న 1,574 గృహాలలో 1,566 ఇళ్లకు నష్టపరిహారంగా రూ. 71.95 లక్షలను అందించామన్నారు. వరదలకు జిల్లాలో చనిపోయిన 89 పశువులు, 870 కోళ్లకు నష్టపరిహారం అందించాలని కోరుతూ రూ. 28.78 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇప్పటివరకు చేసిన సర్వే ద్వారా 17,700 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించామని, 108 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయని పేర్కొన్నారు. సర్వే కొనసాగుతోందని, తుది నివేదికలు వచ్చిన తర్వాత ప్రభుత్వానికి నష్టపరిహారం కోసం నివేదిస్తామని తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో ప్రభుత్వ స్థలాలలో ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న రెండు రోజులు మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, కామారెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవోలు వీణ, పార్థసింహారెడ్డి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

కామారెడ్డి క్రైం: ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 41 మందిని సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరింత ఆదర్శవంతంగా విద్యాబోధన చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఈవో రాజు, ఆర్డీవో వీణ, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు తుది ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈనెల 10న తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిషత్ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈనెల 6న జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామపంచాయతీలలో ముసాయిదా ఓటరు, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రదర్శించామన్నారు. దీనిపై సోమవారం వరకు అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరించామని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను మంగళవారం పరిశీలించి, పరిష్కరిస్తామని, బుధవారం తుది ఓటరు, తుది పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌'ఫార్మర్' కష్టాలు పట్టించుకోరా?



భవానీపేటలో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న రైతులు

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లింది. పాల్వంచ మండలం భవానీపేట గ్రామ శివారులోని ఎస్ఎస్10 ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుతు సరఫరా అయ్యే స్తంభాలు పడిపోయాయి. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలి రెండు వారాలు కావస్తోంది. ఇప్పటికీ దానిని పునరుద్ధరించలేదు. విద్యుత్ శాఖ అధికారులు వచ్చి చూసి వెళ్లారే తప్ప.. ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో మోటార్లు పనిచేయడం లేదని, దీంతో నీరందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అవసరమైన మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

తేలిన పరిషత్ లెక్క

కామారెడ్డి అర్బన్: జిల్లాలో పరిషత్ ఎన్నికలకు సంబంధించిన స్థానాలను ఖరారు చేస్తూ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ చందర్ నాయక్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం జిల్లాలో 25 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 1,259 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

మండలాలవారీగా ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

మండలం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ కేంద్రాలు	మండలం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ కేంద్రాలు
			లింగంపేట	14	75
			బాన్సువాడ	11	65
కామారెడ్డి	6	37	నస్రుల్లాబాద్	8	45
రాజంపేట	8	44	భిక్కనూరు	14	67
బీబీపేట	8	51	బీర్కూర్	7	43
దోమకొండ	9	44	జుక్కల్	14	73
మాచారెడ్డి	7	45	బిచ్కుంద	10	51
పాల్వంచ	6	33	పెద్దకొడప్‌గల్	7	36
ఎల్లారెడ్డి	8	47	పిట్లం	13	69
నాగిరెడ్డిపేట	10	50	మద్నూర్	12	56
గాంధారి	15	80	డోంగ్లీ	5	26
రామారెడ్డి	10	56	నిజాంసాగర్	5	29
సదాశివనగర్	12	67	మహ్మద్‌నగర్	5	29
తాడ్వాయి	9	54			

అధికార ముద్ర ఉంటేనే సహకారం

- విండో పాలకవర్గాల పదవీకాలం పొడిగింపులో రాజకీయ జోక్యం
- జిల్లాలో 18సొసైటీలకు మాత్రమే పొడిగింపు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీసీఎస్) పాలక వర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిల్లాలో మాత్రం పదవీకాలం పొడిగింపు విషయంలో రాజకీయ జోక్యం పెరిగి కొన్ని సంఘాల పాలకవర్గాలను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 14తో పదవీ కాలం ముగియాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించిన విషయం తెలిసిందే. అప్పుడు 55 సంఘాలు యథావిధిగా పనిచేశాయి. ఆరు నెలల సమయం ఆగస్టు 14తో ముగియడంతో మరోసారి ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించింది. దీని ద్వారా జిల్లాలోని 55సంఘాల పాలకవర్గాలు మరో ఆరు నెలల పాటు కొనసాగాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో మాత్రం విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర పార్టీలకు చెందిన చైర్మన్లు ఉన్న సొసైటీలను ఏదో ఒక కారణంతో పక్కకు తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ కొన్ని సంఘాలకు ఉత్తర్వులు ఇవ్వకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

కామారెడ్డి నియోజకవర్గంలో 13 సంఘాలుండగా ఐదింటికే పొడిగింపు అవకాశం ఇచ్చారు. ఒక సంఘం చైర్మన్‌పై సమావేశాలు నిర్వహించకపోవడంతో పాటు నిధుల దుర్వినియోగం ఆరోపణలున్నాయి. నిధుల దుర్వినియోగం, అక్రమాలకు పాల్పడడం వంటి ఆరోపణలు వచ్చినపుడు తప్పు జరిగినట్లు విచారణలో తేలితే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే మిగతా ఏడు సంఘాలకు సంబంధించి పొడిగింపునకు అర్హత ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ వారికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఆయా సొసైటీలకు అధికారులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆక్షేపణలను కారణంగా చూపి వారి పదవీ కాలాన్ని పొడిగించకపోవడం విస్మయం కలిగిస్తోంది. సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడిగింపు విషయంలో అధికారులు అధికార పార్టీకి చెందిన వారికి ఒక న్యాయం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారికో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు చైర్మన్లు ఆరోపిస్తున్నారు. నిబంధనలను పాటిస్తూ అన్ని సొసైటీల పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

పట్టు పరిశ్రమతో అధిక లాభాలు



బీబీపేట : పట్టు పరిశ్రమ ఏర్పాటుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి అయిలయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో కుర్ల దేవయ్యకు చెందిన మల్బరీ తోటను ఆయన పరిశీలించారు. రైతులు మల్బరీ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. దీనిపై జిల్లాలోని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యత్వం రద్దుపై స్టే

బాన్సువాడ : మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యత్వం రద్దుపై కోఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు స్టే ఇచ్చిందని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గాదం సత్యనారాయణ తెలిపారు. లింగంపేట్ మండలంలోని మోతె గ్రామ పారిశ్రామిక సొసైటీలో తన ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఇచ్చిన ఆర్డర్‌పై తాను ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. కోర్టు సోమవారం స్టే ఇచ్చిందన్నారు.

'పెండింగ్ వేతనాలను చెల్లించండి'

కామారెడ్డి టౌన్: తమకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ డాటా ఎంట్రీ ఆపరేటర్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కోరారు. సోమ వారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతి పత్రం అందజేశారు. న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్రాన్, అమీన్, గౌతమ్, గంగాధర్, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి క్రైం : విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడానికి, సృజనాత్మకత ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. పరిశోధనలు, ప్రయోగాల్లో విద్యార్థులు రాణించేలా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు చదువుతున్న వారు ఈ పోటీలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. దీంట్లో ప్రతిభ చూపిన వారికి ప్రముఖ పరిశోధన సంస్థలలో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి, విద్యార్థి విజ్ఞాన్ మంథన్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామపాలన అధికారులకు కౌన్సెలింగ్

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామ పాలన అధికారులుగా ఎంపికైన వారికి కౌన్సెలింగ్ ద్వారా క్లస్టర్‌లను కేటాయించనున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెవెన్యూ శాఖలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి ఇతర శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 363 మందిని తిరిగి రెవెన్యూలో గ్రామ పాలన అధికారులుగా తీసుకున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు సకాలంలో హాజరుకావాలని సూచించారు.


యూరియా కొరత తీర్చాలి



సదాశివనగర్: మండలంలో యూరియా కొరత తీర్చాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ మండలాధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, మండల కార్యదర్శి నారాయణరెడ్డి, డివిజనల్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలభైరవుడికి 108 కలశాలతో అభిషేకం



రామారెడ్డి: దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి) గ్రామంలో వెలిసిన శ్రీకాళభైరవుడికి గ్రహణము ముగిసిన సందర్భంగా సోమవారం సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 108 నూతన కలశాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్: సంపూర్ణ చంద్రగ్రహణం పూర్తి కావడంతో సోమవారం మధ్యాహ్నం మండలంలోని ప్రముఖ ఆలయాలను భక్తులు, సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

కామర్స్ విభాగం డీన్‌గా ప్రొఫెసర్ యాదగిరి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ ఎం యాదగిరి కామర్స్ విభాగం డీన్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. కామర్స్ విభాగంలో మూడు దశాబ్దాల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ప్రొఫెసర్ యాదగిరి తెయూలో అనేక అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులు సమర్థంగా నిర్వహించారు. ప్రస్తుతం ప్రొఫెసర్ యాదగిరి తెయూ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు.

సోషల్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ కే.రవీందర్‌రెడ్డి సోషల్ సైన్స్ డీన్‌గా నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి సోమవారం రవీందర్‌రెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. రవీందర్‌రెడ్డి ప్రస్తుతం తెయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్నారు.

కొనసాగుతున్న బీఈడీ, ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. బీఈడీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 27 మంది విద్యార్థులకు 18 మంది హాజరుకాగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 31 మందికి గానూ 30 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. వర్సిటీ కళాశాలలో సోమవారం జరిగిన ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో మొత్తం 39 మంది విద్యార్థులకు 34 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 73 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 73 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పింఛన్ల మంజూరు, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

వెంచర్‌లో గ్రామ పంచాయతీకి వదిలిపెట్టాల్సిన ఓపెన్ ల్యాండ్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని భిక్కనూర్‌కు చెందిన గంగల రవీందర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. భిక్కనూరు జీపీకి చెందిన ఆ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

మొరం అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న భైరాపూర్ గ్రామస్తులు

ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామస్తులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వే నెంబరు 30 లో చిన్న, పెద్ద గుట్టలు ఉన్నాయని తెలిపారు. వాటిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు. మరికొందరు తమకు ఈ సర్వే నెంబర్‌లో పట్టా భూములు ఉన్నాయని చెబుతూ యథేచ్ఛగా మొరం అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్ని క్రమబద్ధీకరించి గ్రామస్తులు వద్దు ఆరబెట్టుకునేందుకు, పశువుల మేతకు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సమితి జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6 వేలు,తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలు పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలు కావస్తున్నా పింఛన్‌ను పెంచడం లేదన్నారు. తమ గోడు వినేందుకు కలెక్టర్ రావాలని పట్టుబట్టి దాదాపు గంటపాటు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు.ఆర్డీవో వీణ, డీఆర్‌డీవో సురేందర్, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల వారి వద్దకు వచ్చి సముదాయించారు. ప్రజావాణి ముగించుకుని బయటకు వస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వారిని చూసి ఆగారు. దివ్యాంగులతో మాట్లాడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు వెనుదిరిగారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న అధికారులు

ముంపు బాధ తప్పించండి



మాట్లాడుతున్న దేవీ విహార్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

డ్రైనేజీలు సక్రమంగా లేక వరదలు వచ్చినప్పుడు తమ కాలనీ ముంపునకు గురవుతున్నదని.. జిల్లా కేంద్రంలోని దేవి విహార్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ కాలనీలోకి పై ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చిందన్నారు. వరద నీరు బయటకు వెళ్లే దారి లేక కాలనీలోని ఇళ్లు నీట మునిగాయన్నారు. కాలనీ వద్ద ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురికి కాలువలు చిన్నవిగా ఉండటంతో ప్రవాహం తక్కువగా ఉండి ముంపునకు గురవుతున్నామని వాపోయారు. నిజాంసాగర్ రోడ్డుపై రెండు చోట్ల పెద్ద సైజులో కల్వర్టులు, రోడ్డుకు ఇరువైపులా పెద్ద సైజులో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి కాలనీని కాపాడాలని విన్నవించారు.

అక్షరాస్యతను పెంచాలి



మాచారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మాచారెడ్డి: ప్రతి ఒక్కరూ సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేసి అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఎంఈవో దేవేందర్‌రావు అన్నారు. సోమవారం మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్‌లో వయోజన విద్య నవ భారత్ సాక్షరతలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సీఆర్‌పీ దేవ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలని వారు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఎంఈవో రాజులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



గండిమాసానిపేటలో..

విద్య ప్రతి ఒక్కరికి అవసరం



బీబీపేటలో..

బీబీపేట: ప్రస్తుత రోజుల్లో విద్య ప్రతి ఒక్కరికి అవసరమని బీబీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలి



ఖలీల్‌వాడి: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలకు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పాల్గొని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చని తెలిపారు.

వేగ నియంత్రణకు ఏర్పాట్లు

- ప్రజల ప్రాణాలను కాపాడేందుకే స్పీడ్ లేజర్ గన్‌లు
- ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గింది
- నిబంధనలు ఉల్లంఘిస్తే చలానాలు తప్పవు
- ఎస్పీ రాజేశ్ చంద్ర



సదాశివనగర్ మండల కేంద్రం శివారులో స్పీడ్ లేజర్ గన్‌ను పరిక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ

సదాశివనగర్: ప్రజల ప్రాణాలను కాపాడేందుకే వేగ నియంత్రణ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. సోమవారం మండల కేంద్రం శివారు అయ్యప్ప ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై స్పీడ్ లేజర్ గన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చలానాలు తప్పవన్నారు. జిల్లాలో మూడు స్పీడ్ లేజర్ గన్‌లు వాహనదారుల వేగాన్ని నియంత్రించడానికి ఏర్పాటు చేశామన్నారు. సంవత్సర కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పూర్తిగా తగ్గిందన్నారు. 2024 ఆగస్టు వరకు 188 ప్రమాదాలు చోటు చేసుకోగా, వాటిని 145కి తగ్గించగలిగామన్నారు. అదే విధంగా మరణాలు 197 నుంచి 153కి తగ్గినట్లు తెలిపారు. గాయపడ్డ వారి సంఖ్య 181 నుంచి 173కి తగ్గినట్లు పేర్కొన్నారు. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించి క్రమంగా వారి వేగ నియంత్రణ చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. లేజర్ గన్స్‌ను జిల్లాలో పరిధిలో 44వ, 161వ జాతీయ రహదారులపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రోడ్డు భద్రతా చర్యల విజయాన్ని సూచిస్తూ ప్రజల ప్రాణాల రక్షణలో గొప్ప ముందడుగుగా నిలిచామన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రిలీఫ్ కిట్ల పంపిణీ



కామారెడ్డిలో వరద బాధిత కుటుంబాలకు రిలీఫ్ కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని వరద బాధిత కుటుంబాలకు సోమవారం కామారెడ్డి పట్టణంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో రామకృష్ణ మఠ్, ఇన్ఫోసిస్ సహకారంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా 334 రిలీఫ్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మునుపెన్నడూ లేని విధంగా వరదలు సంభవించి తీవ్ర నష్టం కలిగిందన్నారు. వరద బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు రామకృష్ణ మఠ్ ముందుకు వచ్చి ఇప్పటికే వైద్య శిబిరాలు నిర్వహించదని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 9న మంగళవారం ఎల్లారెడ్డిలో వరద బాధిత కుటుంబాలకు 150 కిట్లను, బాన్సువాడలో 150 కిట్లను ఇన్ఫోసిస్, రామకృష్ణ మఠ్ సహకారంతో అందిస్తామన్నారు. మొత్తం కిట్ల విలువ రూ. 20 లక్షలు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు.

'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్'పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు, ఉపాధ్యాయులలో పర్యావరణహిత ఆలోచనలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్)'పై నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ వస్త్రాల రాజశేఖర్ మాట్లాడుతూ.. నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాల స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ పాటించడంతోపాటు హరిత పాఠశాలలు నెలకొల్పేందుకు కేంద్రప్రభుత్వం దేశంలోని అన్ని పాఠశాలల్లో ఎస్‌హెచ్‌వీఆర్‌పై గ్రేడింగ్ ఇవ్వనుందన్నారు. మంచి గ్రేడింగ్ వచ్చిన పాఠశాలలకు రాష్ట్రస్థాయిలో రూ.లక్ష నగదుతోపాటు పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఉచితంగా విహారయాత్ర కల్పించనున్నట్లు చెప్పారు. సర్వేలో భాగంగా పాఠశాల వివరాలు, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతి పాఠశాలను సంబంధిత అధికారి సందర్శించి ఆన్‌లైన్లో నమోదు చేసిన వివరాలను తనిఖీ చేస్తారని చెప్పారు. మండలానికి ఉత్తమ పురస్కారం వచ్చేలా ప్రతి ఒక్క హెచ్‌ఎం కృషి చేయాలని గోపాల్‌పేట హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకట్రాం రెడ్డి సూచించారు. సీఆర్పీలు రాజయ్య, కృష్ణస్వామి, యంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు మన ఆర్థిక వ్యవస్థ ఆదర్శం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ, నిర్మలాసీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ధన్‌పాల్, దినేశ్

సుభాష్‌నగర్: ప్రపంచ దేశాలకు భారత ఆర్థిక వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. దేశ ప్రజలకు దీపావళి కానుకగా జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చినందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు నగరంలోని గాంధీచౌక్‌లో సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితోకలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడారు. జీఎస్టీపై గగ్గోలు పెట్టిన ప్రతిపక్షాలకు ఇది చెంపపెట్టన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉపయోగించే షాంపు నుంచి లగ్జరీ కార్ల వరకు భారీ ఊరట కల్పించారని హర్షం వ్యక్తంచేశారు. తద్వారా దేశంలో దీపావళి పండుగ సంబరాలు ఇప్పుడే మొదలయ్యాయన్నారు. ప్రధానంగా ఆరోగ్య, జీవిత బీమాలతో పాటు 33 రకాల అత్యవసర మందులపై జీరో జీఎస్టీ ఒక విప్లవాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగస్వాములవుతూ మన దేశ ఉత్పత్తులు పెంచి, గ్రామీణస్థాయి నుంచి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న మోదీ సంకల్పానికి తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బంటు రాము, నాయకులు జ్యోతి, వనిత, ఇప్పకాయల కిశోర్, తారక్ వేణు, హరీశ్‌రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, మాస్టర్ శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిప్రిలో గౌడ కులస్తుల బహిష్కరణ



పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన పిప్రి గౌడ కులస్తులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గౌడ కులస్తులపై గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బహిష్కరణ వేటు వేశారు. కల్లు ధర పెంపు విషయంలో గ్రామానికి చెందిన తమను వీడీసీ బహిష్కరించినట్లు సోమవారం 54 గౌడ కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ప్రస్తుతం ఉన్న ధర సరిపోవడం లేదని, ధర పెంచుకుంటామని వీడీసీ దృష్టికి తీసుకెళ్లగా, తెల్లకాగితంపై సంతకాలు పెట్టి ఇవ్వాలని లేదంటే తాము చెప్పినట్లు వినాలని హుకుం జారీ చేసినట్లు తెలిపారు. తెల్లకాగితంపై సంతకాలు చేయకపోవడంతో తమను బహిష్కరించినట్లు పేర్కొన్నారు. తమకు సంబంధించిన హోటళ్లు, దుకాణాలు, ఆటోల్లోకి ఎవరినీ రానివ్వకుండా ఆంక్షలు పెట్టినట్లు గౌడ కులస్తులు తెలిపారు.

యువ ఆపదమిత్ర శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నాగారం: నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్కర సమయాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి, భద్రతా దళాలకు అండగా ఉండేందుకు యువతను సుశిక్షితులను చేసే అద్భుతమైన కార్యక్రమమని పేర్కొన్నారు. నిజామాబాద్ లేదా హైదరాబాద్‌లో వారం రోజులపాటు జరిగే శిక్షణ శిబిరం ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఆపత్కాలంలో ఉపయోగపడే ఎమర్జెన్సీ కిట్‌తోపాటు ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం జారీ చేసిన అడ్రస్ ప్రూఫ్‌తో జిల్లాకు చెందిన 18–40 ఏళ్ల వయస్సు యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9100435410 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్సు ఢీకొని ఒకరు..



ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆగ్రాకు చెందిన సంతోష్(32) సోమవారం బైక్‌పై ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్‌కు వస్తున్నాడు. కంఠేశ్వర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ముందున్న ఓ స్కూల్ బస్సును బైక్ ఢీకొట్టింది. ఆ వెంటనే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న సంతోష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన మానేయకుర్ రమేశ్(44) అప్పులబాధతో ఆదివారం గడ్డి మందు తాగినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని చంపిన కేసులో ఓ కుమారుడికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలిలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ మండలానికి చెందిన జాన్కంపల్లి విఠల్ 2021 మార్చి 16న హత్యకు గురయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా చిన్న కుమారుడు సంగమేశ్వర్‌తో తరుచూ గొడవలు జరిగేవి. సంగమేశ్వర్ తన తండ్రిని హత్య చేసి ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కానీ అనుమానించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణలో హత్యగా తేలింది. దీంతో సంగమేశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితునికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, కేసును సరైన పద్ధతిలో విచారణ జరిపిన సీఐలు రాజశేఖర్, రాజారెడ్డి, ఎస్సై రాజయ్య, భార్గవ్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారి రామేశ్వర్‌రెడ్డి, సిబ్బంది సాయిలును ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

క్రైం కార్నర్

జార్ఖండ్‌లో అబ్బాపూర్‌తండావాసి మృతి

- మృతుడు పోస్టల్ ఉద్యోగి



నవీపేట: మండలంలోని అబ్బాపూర్ తండాకు చెందిన సభావత్ శ్రీహరి(20) సోమవారం జార్ఖండ్‌లో జరిగిన నీటి ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్ తండాకు చెందిన సభావత్ కైలాస్ కుమారుడు జార్ఖండ్ రాష్ట్రంలోని చక్రధర్‌పూల్ పరిధి ఒటాదిరి బ్రాంచ్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆయన స్నేహితులతో కలిసి సమీపంలోని వాటర్‌ఫాల్‌కు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగి నీటమునిగాడు. ఊపిరాడకపోవడంతో మృతి చెందాడు. జార్ఖండ్ పోలీసులు మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శ్రీహరి మృతితో అబ్బాపూర్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాము కాటుతో ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల మొగులయ్య(59) పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. మొగులయ్య ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. ఏదో కుట్టినట్లు తెలియడంతో నిద్ర నుంచి మేల్కొని పరిశీలించగా పాము కనిపించింది. కుటుంబసభ్యులకు తెలపడంతో పామును చంపేసి మొగులయ్యను చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మొగులయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



కామారెడ్డి క్రైం: అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వస్తూ దారి మరిచి తప్పిపోయిన చిన్నారిని పట్టణ పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన తూర్పాటి లక్ష్మి–చింటులకు 4 ఏళ్ల కుమార్తె సాయి పల్లవి ఉంది. ఆమె ప్రతిరోజు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఉదయం 10 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2.45 గంటలకు తిరిగి వచ్చేది. సోమవారం ఇంటికి వస్తుండగా దారి తప్పి ఎక్కడికో వెళ్లిపోయింది. బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది గాలించడంతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిరిసిల్లా రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీకాంత్ బాలికను చేరదీసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి కుటుంబసభ్యులకు సమాచారం అందించి చిన్నారిని అప్పగించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తికి దేహశుద్ధి

రాజంపేట: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నముండ్ల నరేశ్ కొంతకాలంగా దొంగతనాలు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం గ్రామానికి చెందిన సావుసాని మహేందర్ రెడ్డి బోరు మోటారును నరేశ్ దొంగలించాడు. అనుమానం వచ్చిన మహేందర్‌రెడ్డి గ్రామస్తుల సహకారంతో సోమవారం నరేశ్‌ను ప్రశ్నించాడు. నరేశ్ వద్ద అనుమానాస్పదంగా ఓ బైకు కూడా కనిపించడటంతో గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి స్టేషన్‌కు తరలించారు.

ఇసుక బొలెరో పట్టివేత



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు. వాహనాన్ని డోంగ్లీ తహసీల్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన శంషుద్దీన్‌కు తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఆదివారం పశువులను మేపుకొని రాత్రి ఇంటికి తీసుకెళ్తుండగా గాంధారి–బాన్సువాడ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. దీంతో శంషుద్దీన్‌కు రెండు కాళ్లు విరగడంతోపాటు వెన్నుపూసకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాధితుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.